# ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం (APCLC)

అధ్యక్షులు : యం.టి. ఖాన్
ఇ.నం.21-5-409, పురానాపూల్ గేట్,
హైద్రాబాద్-500 264

ప్రధాన కార్యదర్శి : డా॥ కె. బాలగోపాల్
ఇ.నం.2-2-186/17/2ఎ, స్వేఛ్ఛా అపార్ట్‌మెంట్స్,
బాగ్ అంబర్‌పేట్,
హైద్రాబాద్-500 013

గౌరవనీయులైన ముఖ్యమంత్రిగారికి,
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం,
హైదరాబాద్

అయ్యా !

కొత్తగా రాష్ట్ర పాలనా వ్యవహారాలు నిర్వహించే బాధ్యత స్వీకరించిన మీ ప్రభుత్వానికి పౌరహక్కుల సంఘం అభినందనలు.

ప్రజలను, ప్రజల హక్కులను, ప్రజాస్వామ్య విలువలను నిర్లక్ష్యం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజలలో పెల్లుబికిన నిరసన మీ ప్రభుత్వం ఎన్నికకు మార్గం వేసిందని అందరూ ఒప్పుకుంటారు. ఆ నిరసన ప్రజలలోని బలమయిన ఆకాంక్షను తెలియజేస్తుంది. అది తమను, తమ హక్కులను, తమ సంక్షేమాన్ని, ప్రజాస్వామ్యాన్ని గౌరవించే ప్రభుత్వం కావాలనే ఆకాంక్ష.

ఈ ఆకాంక్షను మీరు తీర్చాలంటే వివిధ సామాజిక ఆర్థిక రంగాలలో తగు చర్యలు చేపట్టవలసి ఉంటుంది. ప్రత్యేకించి ప్రజల జీవించే హక్కుకు, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు సంబంధించిన పౌరహక్కుల రంగంలో అనేక చర్యలు చేపట్టనిదే ప్రజలు మీమీద పెట్టిన బాధ్యత తీర్చినట్టు కాదు.

మేము రాష్ట్రంలో రెండు దశాబ్దాలకు పైగా పౌరహక్కుల పరిరక్షణకోసం కృషి చేస్తున్నాం. పౌరహక్కులు పాలకుల చేతిలో, బలవంతుల చేతిలో ఏవిధంగా నాశనం అవుతున్నాయో నిత్యం చూస్తున్నాం. అందోళన చేస్తున్నాం.

ఈ అనుభవంతో, పౌరహక్కులను, ప్రజాస్వామ్య విలువలను నిలబెట్టడానికి మీ ప్రభుత్వం తప్పనిసరిగా చేపట్టవలసిన కొన్ని చర్యలను మీకు సూచిస్తున్నాము. వాటి ప్రాముఖ్యాన్ని గుర్తించి, తగురీతిలో స్పందిస్తారని ఆశిస్తాము.

1. పోలీసు అత్యాచారాలు సమాజంలోని బలహీన వర్గాల ప్రజలు, పేదప్రజలు ఎదుర్కొంటున్న ఒక ముఖ్యమయిన నిత్యజీవిత పౌరహక్కుల సమస్య. 1986-89 మధ్య కాలంలో మన రాష్ట్రంలో పోలీసు కస్టడీ మరణాలు, పోలీసు కాల్పులు, చిత్ర హింసలకు సంబంధించి దాదాపు 30 న్యాయవిచారణలు జరిగాయి. అన్ని నివేదికలూ రాష్ట్ర ప్రభుత్వానికి అందాయి. అయితే వాటిలో ఒకటి రెండు మినహాయించి, మిగిలిన వాటిపైన రాష్ట్రప్రభుత్వం ఇప్పటివరకు చర్య తీసుకోలేదు. ఆ నివేదికలన్నిటి మీద వెంటనే మీరు చట్టపరమైన చర్య తీసుకోవాలి.

2. 1989 తరువాత కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసు అత్యాచారాలపైన న్యాయవిచారణలు జరిపించడం మానుకుంది. గడచిన అయిదేళ్ళలో పోలీసు కస్టడీలో మరణాలు, పోలీసు కాల్పులలో, ఎన్‌కౌంటర్లలో మరణాలు అనేకం జరిగినప్పటికీ కేవలం నాలుగు ఘటనలపైన న్యాయవిచారణలు జరిగాయి. ఇకమీదట అన్ని పోలీసు అత్యాచారాల పైన న్యాయవిచారణ తప్పనిసరిగా జరిపించాలి. న్యాయవిచారణ నివేదికలను తప్పనిసరిగా అమలు చేయాలి.

3. లాకప్ హత్యలు, లాకప్‌లో చిత్రహింసలపైన ఒక ప్రైవేట్ సభ్యుని బిల్లు (నర్సంపేట మాజీ ఎం.ఎల్.ఏ.ప్రవేశ పెట్టినది) అసెంబ్లీ ముందు ఉంది. దానిని వెంటనే చర్చించి శాసన రూపం ఇవ్వాలి.

4. పోలీసుల చేతిలో ఎవరు చనిపోయినా దానికి ప్రభుత్వం బాధ్యత వహించి మృతుల కుటుంబాలకు పూర్తిస్థాయి నష్టపరిహారం ఇవ్వాలని సుప్రీం కోర్టు అనేక తీర్పులలో చెప్పి ఉంది. ఈ సూచనను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసి 1 లక్ష రూ॥లు తక్కువ కాకుండ నష్ట పరిహారం ప్రతీ కేసులోనూ ఇవ్వాలి.

5. జాతీయ మానవ హక్కుల కమీషన్ ఈ సంవత్సరం ఆగస్టులో రాష్ట్రంలో తొలిసారి పర్యటించినపుడు పోలీసులు రాష్ట్రప్రభుత్వం ప్రోత్సాహంతో ఆ పర్యటన లక్ష్యాన్ని భగ్నం చేసారు. ఇంకెప్పుడూ అటువంటిది జరగకుండా చూడాలి. భవిష్యత్తులో జాతీయ మానవ హక్కుల కమీషన్ రాష్ట్రంలో చేపట్టబోయే పర్యటనలతో రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణంగా సహకరించాలి.

రాష్ట్ర స్థాయిలో మానవహక్కుల కమీషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలి. రాష్ట్ర మానవ హక్కుల కమీషన్‌ను అన్ని రాష్ట్రాలలో ఏర్పాటు చేయాలని

జాతీయ మానవ హక్కుల కమీషన్ గతంలో సూచించింది. ఈ సూచనకు అనేక రాష్ట్ర ప్రభుత్వాలు అనుకూలంగా స్పందించాయి. కానీ ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వమే ఇంతవరకు స్పందించలేదు.

6. 'టాడా' చట్టం అన్యాయమయిన శాసనం అనీ దానిని రద్దు చేయాలనీ పౌరహక్కుల సంస్థలే కాక, జాతీయ మానవ హక్కుల కమీషన్ ఛైర్మన్‌తో సహా చాలా మంది ప్రముఖులు అంటున్నారు. 'టాడా' చట్టాన్ని ఇక మీదట మన రాష్ట్రంలో ఉపయోగించకూడదు. ఇప్పటికి రాష్ట్రంలో 8000 దాకా 'టాడా' కేసులు విచారణలో ఉన్నాయి. ఆ కేసులన్నిటిలోను 'టాడా' చట్టం సెక్షన్లు తొలగించివేయాలి. వాటిని మామూలు నేరస్మృతి కింద విచారించాలి.

1995 ఏప్రిల్ నెలలో టాడా చట్టం గడువు తీరిపోతుంది. అయితే దానిని మళ్లీ పొడిగించేందుకు కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టబోతూ ఉందని కేంద్ర హోం మంత్రి ప్రకటనలు స్పష్టం చేస్తున్నాయి. ఆ బిల్లును వ్యతిరేకించవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వం ఈ రాష్ట్రానికి చెందిన పార్లమెంటు సభ్యులందరినీ కోరాలి.

7. నక్సలైట్ ఉద్యమాన్ని కేవలం శాంతి భద్రతల సమస్యగా, నక్సలైట్లను నేరస్తులుగా, చూసే వైఖరి విడనాడాలి. వాళ్ల హింసాత్మక చర్యలను చట్టబద్ధమైన భద్రతా చర్యల ద్వారా ఎదుర్కొంటూనే, వాళ్లను ప్రజాపునాది గల రాజకీయ ఉద్యమకారులుగా గుర్తించి, వాళ్ళతో రాజకీయంగా వ్యవహరించాలి.

అందులో భాగంగా, పీపుల్స్ వార్ గ్రూపు పైన, ఆ పార్టీ అనుబంధ సంస్థల పైన విధించిన నిషేధాన్ని ఎత్తి వేయాలి. అందరిలాగ నక్సలైట్ పార్టీలకు కూడ మీటింగులు పెట్టుకునే హక్కు, తమ భావాలు ప్రచారం చేసుకునే హక్కు కల్పించాలి.

8. 'ఎన్‌కౌంటర్ల' కు స్వస్తి పలకాలి. సాయుధ నక్సలైట్లను పోలీసులు పట్టుకునే ప్రయత్నం చేసినప్పుడు వాళ్ళు ఎదురు తిరిగి పోలీసులకు ప్రాణాపాయం కలిగించే పరిస్థితి ఉత్పన్నమయితే పోలీసులు ఎదురుకాల్పులు జరపవలసిరావచ్చు. అయితే నూటికి 95 శాతం 'ఎన్‌కౌంటర్లు' అటువంటి ఘటనలు కావు. పోలీసులు ఒక వ్యక్తిని ముందుగానే నిర్బంధంలోకి తీసుకొని కాల్చి చంపడం, లేదా ఆదమరచి ఉన్న వాళ్లను నేరుగా కాల్చి చంపడం, నూటికి 95 'ఎన్‌కౌంటర్ల' వాస్తవ కథ. ఈ హత్యాకాండను వెంటనే ఆపాలి.

మొన్నటి ఎన్నికల సందర్భంగా పోలీసులు కరీంనగర్, వరంగల్, నిజామాబాద్ జిల్లాలలో వారం దినాలలో 35 మందిని 'ఎన్‌కౌంటర్ల' పేరిట కాల్చి చంపారు. ఈ ఘటనల పైన రాష్ట్ర ప్రభుత్వం న్యాయవిచారణ జరిపించాలి.

9. పోలీసు కస్టడీ నుండి 'మాయం' అయిన 43 మంది యువకుల ఆచూకీ గురించి గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఒక న్యాయవిచారణ కమీషన్‌ను (టి.ఎల్.ఎన్. రెడ్డి కమీషన్) నియమించింది. ఆ కమీషన్ తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించి రెండేళ్లు దాటింది. అయితే ఇప్పటి దాకా అది వెలుగు చూడలేదు. ఆ నివేదికను ప్రభుత్వం వెంటనే అసెంబ్లీ ముందు పెట్టి, దానిపైన చర్య తీసుకోవాలి.

10. 1990 డిసెంబర్ నెలలో హైదరాబాద్ నగరంలో రాజకీయ ప్రయోజనాల కోసం 'మత ఘర్షణల' పేరిట జరిపించిన మారణకాండలో ముఖ్యులెవ్వరి మీద కేసులు పెట్టలేదు. దానికి కారకులయిన నాయకులంతా తప్పించుకున్నారు. ఆ మారణకాండపైన ప్రభుత్వం తిరిగి దర్యాప్తు జరిపించి హత్యలు చేసిన వారితో బాటు చేయించిన వారిని కూడ కోర్టు ముందు నిలబెట్టి విచారించి శిక్షించాలి.

11. ఎస్.సి., ఎస్.టి. అత్యాచారాల (నిరోధక) చట్టాన్ని సమగ్రంగా అమలు చేయాలి. పోలీసు యంత్రాంగం ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఉంది. దళితుల పైన దాడికి పాల్పడిన అగ్రకులస్తుల పైన కేసు పెట్టే బదులు 'రాజీ' పేరిట పోలీసు అధికారులు దళితులకు అన్యాయం చేస్తున్నారు.

ఈ చట్టం అమలు కోసం ప్రతీ జిల్లాలో ఒక స్పెషల్ కోర్టు నెలకొల్పాలి. ప్రస్తుతం రాష్ట్రంలోని మూడు ప్రాంతాలకు మూడు కోర్టులు మాత్రమే ఉండడం వల్ల జాప్యం ఎక్కువ జరగడమే కాక అవినీతికి ఆస్కారం ఎక్కువ అయింది. పోలీసుల నిర్లక్ష్యానికి కూడ ఒక సాకు దొరికింది. ఇప్పుడున్న స్పెషల్ కోర్టులలోని కొందరు జడ్జిలపైన, పీపీల పైన ఉన్న అవినీతి ఆరోపణలను విచారించి వారిపైన తగుచర్య తీసుకోవాలి.

12. అగ్రకులస్తుల చేతిలో అత్యాచారానికి గురయిన దళితుల పునరావాసాన్ని గురించి పై చట్టంలో స్పష్టమయిన ఆదేశం ఉన్నప్పటికీ, ప్రభుత్వం వారికి పునరావాసం సరిగ్గా కల్పించడం లేదు. జిల్లా కలెక్టర్లు రికమెండ్ చేసిన పునరావాస చర్యలు కూడ మంజూరు కాకుండా దీర్ఘకాలం పెండింగ్ ఉండిపోతున్నాయి. ఈ పరిస్థితిని తొలగించాలి. పునారావాసం ఒక హక్కుగా వెనువెంటనే కల్పించాలి.

13. అగ్రకులాల చేతిలో అత్యాచారానికి గురయిన వారికే కాక, ప్రమాదాలకు గురయిన ఇతర పేదవారికి, దళితులకు జిల్లా కలెక్టర్లు ఎక్స్-గ్రేషియా లేక పునరావాసం రికమెండ్ చేసినా అది కూడ ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండిపోతు ఉంది. ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నవన్నీ వెంటనే మంజూరు చేసి, ఇక మీదట ఈ పరిస్థితి రాకుండ చూడాలి.

14. ఎస్.సి., ఎస్.టి, బి.సీ.ల రిజర్వేషన్ హక్కులను సక్రమంగా అమలు చేయాలి. ప్రభుత్వ శాఖలలో, విద్యా సంస్థలలో (విశ్వ విద్యాలయాలతో సహా), గ్రామపంచాయితీ తదితర రాజకీయ సంస్థలలో రిజర్వేషన్ల అమలులో చాలా అవకతవకలు, మోసం జరుగుతూ ఉంది: ఈ పరిస్థితిని వెంటనే సవరించాలి.

ఇక మీదట ఇటువంటి పరిస్థితి ఉత్పన్నం కాకుండా చూడాలి.

15. మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించ రాదన్న సుప్రీం కోర్టు సూచనను అధిగమించడానికి రాజ్యాంగ సవరణ కోసం ప్రయత్నిస్తామని కర్నాటక, తమిళనాడు ప్రభుత్వాలు ప్రకటించాయి. మన రాష్ట్ర ప్రభుత్వం కూడ ఈ విషయంలో వారితో చేయి కలిపి కృషి చేయాలి.

16. చుండూరు హత్యాకాండ కేసులో అగ్రకుల ముద్దాయిలు స్పెషల్ కోర్టు చుండూరులో పెట్టకూడదనీ, మృతులు క్రైస్తవులే తప్ప దళితులు కారనీ కోర్టులో పిటిషన్ల మీద పిటిషన్లు వేసి కాలయాపన చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు కోర్టులో జోక్యం చేసుకొని వాళ్ళ వాదనలను త్రోసిపుచ్చి కాలయాపన జరగకుండా చూడాలి.

17. స్త్రీలకు రిజర్వేషన్లు కల్పిస్తామని వివిధ రాజకీయ పార్టీలు చేస్తున్న వాగ్దానాలు అమలు కాకుండా ఉండిపోయాయి. విద్యా, ఉద్యోగ రంగాలలో, గ్రామ పంచాయతీ నుండి అసెంబ్లీ వరకు ఉన్న పదవులలో ప్రభుత్వం మంజూరు చేసే చౌక డిపోలు తదితర లైసెన్సులలో స్త్రీలకు రిజర్వేషన్ కల్పించాలి. మొత్తం మీద స్త్రీలు అన్ని సామాజిక రంగాలలో సగభాగం ఉండేటట్టు రిజర్వేషన్‌లు కల్పించాలి.

18. మనోవర్తి చట్టం ఇప్పటికీ భర్త వదిలిపెట్టిన భార్యా పిల్లలకు చెరి 500 రూ॥లు మించకుండ మనోవర్తి మంజూరు చేస్తుంది. అయితే పెరిగిన ధరలను, ఆదాయాలను దృష్టిలో పెట్టుకొని ఆ పరిమితిని కనీసం 1000 రూ॥లకు పెంచుతూ సి.ఆర్.పి.సి. సెక్షన్ 125ను సవరించాలి. ఈ సెక్షన్ ముస్లిం స్త్రీలకు వర్తించకుండ కేంద్ర ప్రభుత్వం చేసిన చట్టం వల్ల ముస్లిం స్త్రీలకు చాలా అన్యాయం జరుగుతూ ఉంది. ఆ చట్ట ప్రకారం భార్యా భర్తలిద్దరూ ఒప్పుకుంటేనే సిఆర్‌పిసి సెక్షన్ 125 వర్తిస్తుంది. దీనిని సవరించి ముస్లిం స్త్రీకి హిందూ స్త్రీతో సమానంగా హక్కులు కల్పించాలి.

19. కుటుంబం లోపల స్త్రీలపైన జరిగే హింస గురించి చర్య తీసుకోవడానికి అవసరమైన చట్టాలు పార్లమెంటు చేసినప్పటికీ పోలీసులు ఆ చట్టాలను పట్టుదలతో అమలు చేయకుండా ఆ హింసాకాండను 'పెద్ద మనుషుల' పరిష్కారానికి వదిలేస్తున్నారు. పోలీసులు ఈ వైఖరి విడనాడి తమ చట్టబద్ధమయిన విధిని సక్రమంగా నిర్వర్తించాలని ఆదేశాలు ఇవ్వాలి.

20. అశ్లీల సాహిత్యాన్నీ సినిమాలనూ నిరోధించడానికి ప్రభుత్వం తన పరిధిలో అధికారం ఉన్న మేరకు కృషి చేయాలి. స్త్రీలపైన జరుగుతున్న లైంగిక హింస పెరగడానికి ఈ సంస్కృతి ఒక ముఖ్య హేతువు.

21. హైదరాబాద్‌లోనూ ఇతర తెలంగాణా జిల్లాలలోనూ ముస్లిం యువకులను పాకిస్తాన్ ఐఎస్ఐ ఏజెంట్లుగా, కాశ్మీరీ మిలిటెంట్ల ఏజెంట్లుగా అనుమానించి వేధించడం జరుగుతూ ఉంది. సీనియర్ పోలీస్ అధికారులు పదే పదే ఐఎస్ఐ కార్యకలాపాల గురించి నిరాధారమైన ప్రకటనలు చేస్తున్నారు. ముస్లింలందరూ తాము కాశ్మీరి మిలిటెంట్లకు సహాయం చేయడం లేదనీ, పాకిస్తాన్ ఏజెంట్లు కామనీ రుజువు చేసుకోవలసిన స్థితి కల్పించబడుతూ వుంది. ముస్లింలను భయభ్రాంతులు చేస్తున్న ఈ పోకడలను నిరోధించాలి.

22. రెగ్యులేషన్ I ఆఫ్ 1970ని కట్టుదిట్టంగా అమలు చేసి బదలాయింపుకు గురయిన ఆదివాసుల భూమిని తిరిగి ఆదివాసులకు ఇప్పించాలి. ఆ చట్టాన్ని నీరుగార్చే ప్రయత్నాలు పదే పదే జరుగుతున్నాయి. వాటిని ఎట్టి పరిస్థితిలోనూ ప్రోత్సహించకూడదు.

23. ఆదివాసీలు అడవులలో దున్నుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలి. అది రిజర్వ్ అడవి అయిన పక్షంలో దానిని డీ రిజర్వ్ చేయడానికి కేంద్రప్రభుత్వం అనుమతి తీసుకొని, డీ రిజర్వ్ చేసి, వారికి పట్టాలు ఇవ్వాలి.

24. జీవిత ఖైదీల విడుదలకు సంబంధించి 1990లో రాష్ట్రప్రభుత్వం ఒక జీవో జారీ చేసింది. మూడు నెలలకు ఒకసారి జీవిత ఖైదీల కేసులను సమీక్షించి యోగ్యులయిన వారిని విడుదల చేయాలని ఈ జీవో అంటుంది. అయితే ఈ జీవో సక్రమంగా అమలు కావడం లేదు. దీనిని సక్రమంగా నియమబద్ధంగా అమలు చేయాలి.

25. కాలుష్య నివారణ చట్టాలు మన రాష్ట్రంలో అసలే అమలు కావడం లేదు. పారిశ్రామిక ప్రగతి అవసరం అని చెప్పి పారిశ్రామిక కాలుష్యం పట్ల ప్రభుత్వం చాలా ఉదాసీనంగా ఉంటూ ఉంది. కాలుష్య నివారణ చర్యలు చేపట్టడానికి పరిశ్రమాధిపతులు ఎన్నిసార్లు గడువు కోరినా ప్రభుత్వం ఇస్తూనే ఉంది. చట్టాన్నే కాదు కోర్టు ఆర్డర్లను సహితం అమలు చేయడం లేదు. ఈ వైఖరి మానుకొని ప్రజల ఆరోగ్యానికీ, పంటలకూ, త్రాగునీటికీ, పశుగ్రాసానికీ హానికరమయిన కాలుష్యాన్నీ కట్టుదిట్టంగా అరికట్టాలి.

26. మన రాష్ట్రంలో పరిశ్రమల ఖాయిలా సమస్య తీవ్రంగా ఉంది. 135 పెద్ద తరహా, మధ్య తరహా మిల్లులు, దాదాపు 30 వేల చిన్న తరహా మిల్లులు ఖాయిలా పడి ఉన్నాయి. వీటి నన్నిటినీ తెరిపిస్తే కొన్ని లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. వీటిని తెరిపించడానికి ప్రభుత్వం చొరవ తీసుకోవాలి. హైదరాబాద్‌లోని ఏ.పి. స్కూటర్స్‌ను, గుంతకల్‌లోని స్పిన్నింగ్ మిల్లును, కర్నూలు లోని రాయలసీమ పేపర్ మిల్లును, గుంటూరులోని బజ్రంగ్ జూట్ మిల్లును ఈ రోజో రేపో తెరిపిస్తామని గత ప్రభుత్వం చాలాసార్లు ప్రకటించింది. కానీ ఏమీ జరుగలేదు.

27. తీరప్రాంతంలో వేగంగా విస్తరిస్తున్న రొయ్యల చెరువుల వల్ల పేదలకు అందుబాట్లో ఉన్న భూమి పెట్టుబడి దార్ల చేతిలోకి పోతూ ఉంది.

జలకాలుష్యం, పరిసరాల కాలుష్యం పెరిగింది. కూలివాళ్లకు పనిదొరకక నిరుద్యోగులవుతున్నారు. ఈ రొయ్యల చెరువులను ఒక మోతాదుకు మించి విస్తరించనీయకూడదు. అవి కూడ మత్స్యకారులు, ఇతర దళితప్రజల సహకార సంఘాలకే ఇవ్వాలి. కాలుష్యాన్ని ప్రయత్న పూర్వకంగా అరికట్టాలి.

28. విద్యారంగంలో అక్షరాస్యతా కార్యక్రమాలతో సంతృప్తి చెందకుండ, పిల్లలందరూ కనీసం ప్రాథమిక విద్య తప్పనిసరిగా అభ్యసించడానికి కావలసిన పథకాలు రూపొందించాలి. వాటికి అవసరమయిన బడ్జెట్ కేటాయించి కట్టుదిట్టంగా అమలు చేయాలి.

29. కరువు నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాలి. బ్రిటిష్ వాళ్లు క్షామనివారణ కోసం రూపొందించిన ఫామైన్ రిలీఫ్ చట్టం నమూనాలో కరువు నివారణ చట్టం తయారు చేయాలి. పెండింగ్‌లో ఉన్న చిన్న, పెద్ద నీటి పారుదల ప్రాజెక్టులన్నీ పూర్తి చేయాలి. పెట్టుబడి పెట్టి 'మాయం' అయిపోయిన చెక్‌డ్యాంలు, లిఫ్ట్ స్కీంలపైన విచారణ జరిపించి దోషులను శిక్షించాలి. బావులకు మోటార్లు పెట్టుకున్న రైతులకు కరెంటు లోవోల్టేజ్ సమస్య నిర్హేతుకమైన కరెంటు కోత సమస్య లేకుండ చూడాలి.

30. భూమి లేని పేదలు నివసిస్తున్న, లేక సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములకు, భూస్వాముల మిగులు భూములకు పట్టాలు ఇవ్వాలి. ఈ భూములు ఆక్రమించుకున్నందుకు పేదలపైన పెట్టిన కేసులు ఎత్తివేయాలి. భూములు ఉన్న వాళ్ళు ఆక్రమించుకున్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని లేని వాళ్లకు పంచాలి.

31. సీలింగ్ చట్టం అమలును నిజాయితీగా సమీక్షించి బేనామీలను గుర్తించి మిగులు భూమిని మొత్తం స్వాధీనం చేసుకొని భూమిలేని పేదలకు పంచాలి.

32. దేవాలయ భూములు మొత్తం స్వాధీనం చేసుకొని భూమిలేని పేదలకు పంచి పట్టాలు ఇవ్వాలి. దేవాలయాల నిర్వహణకు భక్తులు ఇచ్చే నిధులతో సరిపెట్టుకోవాలి.

33. హైదరాబాద్ నగరాన్ని మెగాసిటీగా రూపొందించే ముందు నగరంలోని మురికి వాడల ప్రజానీకం కోసం శాశ్వత గృహనిర్మాణ పథకం చేపట్టాలి. మెగాసిటీ పేరుమీద పేదలను నిర్వాసితులను చేయకూడదు. ఈ విషయంలో మన పొరుగు రాజధాని అయిన మద్రాసులో డి.ఎం.కె. ప్రభుత్వం గతంలో అనుసరించిన విధానాన్ని ఆదర్శంగా తీసుకోవాలి.

ఇది హైదరాబాద్ మెగాసిటీ ప్రాజెక్టుకే కాక రాష్ట్రంలో నగర అభివృద్ధి పథకాలు అమలు చేస్తున్న విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, వరంగల్ తదితర పట్టణాలకు కూడ వర్తిస్తుంది. అన్ని పట్టణాలలోనూ ధనవంతులు పెద్ద మొత్తంలో భూములు ఆక్రమించుకొని ఉన్నారు. దానిని స్వాధీనం చేసుకొని పేదల గృహవసతికీ ఇతర నగర అవసరాలకూ వినియోగించాలి.

34. సారా నిషేధాన్నీ, ఇప్పుడు కొత్తగా మీ ప్రభుత్వం ప్రకటించిన సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలి. దానిని విఫలం చేయడానికి పూనుకున్న వారు ఎంతటి బలవంతులయినా ఏ పార్టీవారయినా ఉపేక్షించకూడదు.

నక్సలైట్లతో సహా, సారా వ్యతిరేక ఆందోళనలో పాల్గొన్న వారందరిపైన పెట్టిన క్రిమినల్ కేసులన్నీ ఎత్తి వేయాలి.

35. రాయలసీమ జిల్లాలో ఎన్నికల నేపథ్యంలో సస్పెండ్ చేసిన తుపాకి లైసెన్సులను శాశ్వతంగా రద్దుచేయాలి. దుండగుల నుండి సామాన్య పౌరులకు రక్షణ కల్పించడం కోసం ఉద్దేశించబడిన ఈ తుపాకీ లైసెన్సులు దుండగుల చేతిలోనే ఆయుధాలుగా మారాయి. కాబట్టి ఫాక్షనిస్టులు అయిన వారికి ఎట్టి పరిస్థితులలోనూ ఇక మీదట తుపాకి లైసెన్సులు ఇవ్వకూడదు. వారు ఏ పార్టీకి చెందిన వారయినా ఈ విషయంలో మినహాయింపు ఉండకూడదు. రాయలసీమ జిల్లాల్లో విరివిగా లభిస్తున్న నాటు తుపాకులు, బాంబులను వెలికి తీసి ధ్వంసం చేయాలి. వాటి తయారీని అరికట్టాలి.

ఇవి, క్లుప్తంగా, మేము చేయదలుచుకున్న సూచనలు. వీటిలో ఒకటి రెండు తప్ప మిగిలిన వాటి అమలు మీ ప్రభుత్వం బడ్జెట్ మీద అదనపు భారం వేయదు. ప్రజల సంక్షేమం కోసం ఉద్దేశించబడ్డ చట్టాలనూ, రాజ్యాంగ నియమాలనూ ఖచ్చితంగా అమలు చేయాలన్న సంకల్పం ఉంటే చాలును. ఆ సంకల్పం మీ ప్రభుత్వంలో లోపించదని ఆశిస్తాము. ఒకవేళ లోపిస్తే, ఈ ఎన్నికలలో ప్రజలు మీమీద ఉంచిన విశ్వాసాన్ని వమ్ము చేయడమే అవుతుందని మీరు కూడ అంగీకరిస్తారు.

**శుభాకాంక్షలతో**

భవదీయుడు
(ఎం.టి. ఖాన్)
అధ్యక్షులు
ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం
(ఏపిసిఎల్‌సి)

ప్రతులు:
(1) అన్ని పత్రికలకు
(2) అందరు ఎం.ఎల్.ఏ.లకు
(3) రాష్ట్ర ప్రజలకు